క్లుప్తంగా

తాళ్లపాళెంలో ట్రైయినీ ఐఏఎస్‌లు



కావలి: మండలంలోని తాళ్లపాళెం పంచాయతీలో తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన ఐదుగురు ట్రైయినీ ఐఏఎస్‌లు శుక్రవారం పర్యటించారు. క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా సచివాలయ వ్యవస్థ, సచివాలయాల ద్వారా అందుతున్న పౌరసేవలు, పంచాయతీల ఆర్థిక వనరులు, తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలతో ముచ్చటించి పలు అంశాలను తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

– మూడు నెలలుగా స్పందించని లైన్‌మెన్



అనుమసముద్రంపేట: మండలంలోని రాజవోలు పంచాయతీ పరిధిలోని పుట్టువారిపల్లి సమీపంలోని పొలాల్లో విద్యుత్‌వైర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. మూడు నెలల క్రితం త్రీఫేస్ వైర్లు తెగిపడ్డాయి. అప్పట్నుంచి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు లైన్‌మెన్‌ను కోరుతున్నా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వీఏఏలకు శిక్షణ

మర్రిపాడు: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఏఏలకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఏఓ ఎస్ రామ్మోహన్ ఈ–పంట నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల బీమా పథకంపై శిక్షణ ఇచ్చారు. ఉద్యానశాఖ అధికారి ఎస్ రాజశేఖర్ సూక్ష్మబిందు సేద్యం, జాతీయ చీడపీడల పర్యవేక్షణ, మొబైల్ అప్లికేషన్, ఉద్యాన పంటల్లో ఎరువుల యాజమాన్యం, ఆయిల్‌పామ్ పంట సాగు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు.

సీసీకెమెరాల ఏర్పాటుకు చర్యలు



అనుమసముద్రంపేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలో నేరాల కట్టడితో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై సైదులు తెలిపారు. ఏఎస్‌పేటలోని దర్గా సెంటర్, నగరాఖానా, బస్టాండ్ సెంటర్, పెట్రోల్ బంకు, వినాయకసెంటర్ తదితర ప్రాంతాలను సీసీ కెమెరాల ఏర్పాటుకు టెక్నీషియన్లతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్సై భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

అయ్యప్ప పడిపూజోత్సవం



అల్లూరు: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అల్లూరుపేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో అయ్యప్పస్వామి పడి పూజోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు విశేషంగా పాల్గొని భజనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ఉదయగిరి: మండలంలోని కాశీనాయనగడ్డ సమీపంలో శుక్రవారం బైక్ అదుపుతప్పడంతో కుర్రపల్లికి చెందిన కల్లూరి కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. కాశీనాయనగడ్డకు వెళుతుండగా గుంతలరోడ్డుపై బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడ్ని తొలుత ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాల, అనంతరం నెల్లూరుకు తరలించారు.

పోలీసుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు: వాహనం లీజుకు ఇచ్చిన విషయంలో ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన విషయంలో పోలీసులు వేధిస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చెర్లోయడవల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి బంధువుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆర్ వెంకటకృష్ణ నాలుగేళ్ల క్రితం ఫైనాన్స్‌లో జేసీబీని కొనుగోలు చేశాడు. అనంతరం వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చాడు. కరోనా సమయంలో నెలవారీ వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. అది వడ్డీతో కలిపి ఎక్కువ మొత్తం కావడం, జేసీబీని లీజుకు తీసుకున్న వ్యక్తి లీజు బకాయి నగదు చెల్లించకపోవడంతో గట్టిగా నిలదీశాడు. ఈ నేపథ్యంలో కడపకు చెందిన లీజుదారుడు పోలీసులకు వెంకటకృష్ణపై ఫిర్యాదు చేశాడు. దీంతో కృష్ణ ఇంటికి రోజు ఒకరిద్దరు కానిస్టేబుళ్లు వచ్చి ఫిర్యాదుపై ప్రశ్నిస్తుండడంతో అవమానానికి గురయ్యాడు. శుక్రవారం వెంకటకృష్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు వెంటనే ఆత్మకూరుకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు.

కార్తీక పౌర్ణమి శోభ

కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి శోభ నెలకొంది. వేకువజాము నుంచే శైవక్షేత్రాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజామునే లేచి పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. భక్తుల శివ నామస్మరణతో శైవక్షేత్రాల పరిసరాలు పులకించాయి.

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలోని శివాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ, సంతోష్ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. జేఆర్‌పేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు. పంటవీధి రామాలయంలో కాశీ విశ్వేశ్వర స్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు విశేషంగా తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి తన స్వగ్రామమైన మహిమలూరులోని శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా మందిరం, పోలేరమ్మ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ ఆనంద్, ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, బీజేపీ నేత కుడుముల సుధాకర్‌రెడ్డి, గుండ్రా శ్రీనివాసులు రెడ్డి, మెడికవర్ ఆస్పత్రికి చెందిన కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, రామస్వామిపల్లి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: రాజవోలులోని కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కొండా శ్రీనివాసులరెడ్డి దంపతులు, తిక్కవరపు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి దంపతుల సహకారంతో నక్షత్ర దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెంకటరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చేజర్ల: కోటితీర్థం క్షేత్రంలోని కోటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ సమీపంలో పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ఆచరించిన మహిళలు సాయంత్రం చంద్రుని చూసి ఆకాశ దీపాలు వెలిగించారు. గౌరీ వ్రత పూజలు చేసి ఉపవాసాన్ని విరమించారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పవిత్ర పెన్నానదిలో స్నానమాచరించి తడిబట్టలతో ఆలయ ప్రదక్షిణలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ఆదిదంపతులను దర్శించుకుని పూజలు చేశారు. ఆత్మకూరుకు చెందిన సాంబశివా చారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి 500 మందికి పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉదయగిరి: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయగిరి మండలంలోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని పార్వతి సమేత పరమేశ్వరాలయంతో పాటు గడ్డంవారిపల్లిలోని అడవి పేరంటాలమ్మ ఆలయం, గండిపాళెంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం, కాశీనాయనగడ్డ, లింగాలదొన క్షేత్రం, అప్పసముద్రం, జీ అయ్యవారిపల్లి, ఆర్లపడియ, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో విశేషాభిషేకలు, పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించి నోమలు నోచుకున్నారు.

–వింజమూరులోని శివాలయం, చెన్నకేశవుల స్వామి ఆలయం, కాశీ విశ్వనాథుని ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు.

జలదంకి: జలదంకిలోని జానకి రామలింగేశ్వర స్వామి ఆలయం, బ్రాహ్మణక్రాక, చినక్రాక, గట్టుపల్లిలోని శివాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. మహిళలు ఉపవాసదీక్షలతో శివాలయాలకు చేరుకుని కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు.



సంగంలోని సంగమేశ్వరాలయంలో భక్తజన కోలాహలం



వైభవంగా గిరి ప్రదక్షణ



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కామాక్షిదేవి, సంగమేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆదిదంపతుల విశేషంగా అలంకరించి గిరి ప్రదక్షణను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పుష్పాలతో ఏర్పాటు చేసిన శివలింగాకృతి భక్తులను ఆకట్టుకుంది. సంగమేశ్వరస్వామిని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ దర్శించుకున్నారు.



ఆత్మకూరులో విశేషాలంకారంలో విశ్వేశ్వరుడు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లె, కాంచెరువు, వరికుంటపాడు, రామాపురం, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి శోభ నెలకొంది. భక్తులు విశేషంగా తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామపురం: మండలంలోని సిద్దేశ్వరం, భైరవకోన క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భైరవ క్షేత్రానికి తరలిచ్చిన భక్తులు జలపాతం వద్ద స్నానమాచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కలిగిరి: కలిగిరిలోని పర్వతవర్ధిని నాగమల్లేశ్వర స్వామి ఆలయం, సిద్ధనకొండూరులోని సిద్దేశ్వరాలయం, అగ్రహారంలోని కాలబైరవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాసాలు ఉండి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో ఉదయం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించారు. వెంగమాంబ–గురవయ్య దంపతులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ జరిపారు. ఉసిరిక చెట్టు కింద శివపార్వతుల చిత్రపటాన్ని ఉంచి పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ ఉషశ్రీ ఆధ్వర్యంలో దొడ్డకొండపై ఉన్న వెంమాంబ విగ్రహం వద్ద అఖండ దీపోత్సవం నిర్వహించారు. అయ్యప్ప, వెంగమాంబ దీక్ష చేపట్టిన భక్తులు అధిక సంఖ్యలో పల్లకిసేవలో, దీపోత్సవంలో పాల్గొన్నారు. దుత్తలూరు ఊరకొండపై కొలువైన రామలింగేశ్వరస్వామి, కొత్తపేట, నర్రవాడ, నందిపాడులోని శివాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలుండి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.



వరికుంటపాడు శివాలయంలో..



దుత్తలూరు: వెంగమాంబ సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కలిగిరి శివాలయంలో..



సీతారామపురం: భైరవకోనలో..



మహిమలూరు శివాలయాన్ని దర్శించుకున్న డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి



సీతారామపురం: సిద్దేశ్వరంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు



సోమశిలలో భక్తులకు అన్నప్రసాద వితరణ



అనుమసముద్రంపేట: రాజవోలు శివాలయంలో..



చేజర్ల: కోటితీర్థం క్షేత్రంలో..



జలదంకి: రామలింగేశ్వరాలయంలో భక్తులు



దుత్తలూరు: వెంగమాంబకు పల్లకిసేవ

మహిమలూరు అభివృద్ధికి కృషి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ సహకారంతో తన స్వగ్రామమైన మహిమలూరు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆహ్వానం మేరకు కలెక్టర్ ఓ ఆనంద్ మహిమలూరుకు శుక్రవారం విచ్చేశారు. స్థానికులతో కలిసి కలెక్టర్‌కు స్వాగతం పలికిన సతీష్‌రెడ్డి ప్రజల సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహించారు. మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడుకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరగా, త్వరలోనే నిర్మాణం చేపడుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తాను చదువుకున్న ఉన్నత పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని సతీష్‌రెడ్డి కోరగా, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మహిమలూరులోని కోనేరు అభివృద్ధి, సిమెంట్ రోడ్ల నిర్మాణం, తదితర సమస్యలను సతీష్‌రెడ్డి ద్వారా గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా స్వగ్రామానికి వచ్చిన సతీష్‌రెడ్డిని దాత కంచి పరమేశ్వరరెడ్డి, ఆధ్యాత్మికవేత్త యానాదిరెడ్డి, మెడికవర్ ఆస్పత్రి యజమాని కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, తహసీల్దార్ సుదీర్, సీఐ గంగాధర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పరిశీలన

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో వర్షాలకు నేలవాలి దెబ్బతిన్న వరి పంటను ఏఓ ఆంజనేయులునాయక్ శుక్రవారం పరిశీలించారు. దెబ్బతిన్న వరి పంటకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మినుము, శనగ, రబీ వరి పంటలకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట మాత్రమే దెబ్బతిందన్నారు. వీఏఏలు గ్రామాల్లో పర్యటించి రైతులకు జరిగిన నష్టాల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు

24న మాదిగల ఆత్మీయ సమ్మేళనం

కలిగిరి: ఈ నెల 24న నెల్లూరులో మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నందిపోగు వెంగళరావు తెలిపారు. కలిగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని చెప్పారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్, రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు అనందరావు, కొండయ్య, తిరుమలేషు, శామ్యూల్, మాల్యాద్రి, రాజయ్య, మస్తాన్, శ్రీను, హజరత్, మాలకొండయ్య, సుధీర్, జాషువా, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

సహకార జెండా ఆవిష్కరణ



వింజమూరు(ఉదయగిరి): 71వ అఖిల భారతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా వింజమూరులోని సహకార సంఘంలో సహకార జెండాను కావలి డివిజన్ కోఆపరేటివ్ అధికారి వై మాల కొండయ్య శుక్రవారం ఆవిష్కరించారు. సహకార సంఘ అధికారులు శ్రీనివాసులురెడ్డి, సూర్యనారాయణ, సీహెచ్ రమేష్‌బాబు, కే రామనారాయణ, సురేంద్రరెడ్డి, మేకల రమణయ్య పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

మర్రిపాడు: నందవరం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 8 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో దాసరి నరసింహులు వద్ద మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని,కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జూదరుల అరెస్ట్

ఉదయగిరి: పట్టణంలోని గండిపాళెం మార్గంలోని పాల డెయిరీ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జూదరులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ ఎన్ వెంకట్రావు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

కావలి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 200 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ఉదయగిరి: బయోమెట్రిక్ హాజరు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు సచివాలయ ఉద్యోగులకు ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. జి.చెరువుపల్లి, శకునాలపల్లి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జీ రమేష్, ఎస్.శ్రీకాంత్, ఉదయగిరి సచివాలయం–3 వెటర్నరీ అసిస్టెంట్ అవినాష్, వెంగళరావునగర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జీ అనిల్‌కుమార్, వీఆర్వో సీ పెంచలయ్య, బండగానిపల్లి మహిళా పోలీసు ఎం సబిహ, వీఆర్వో షేక్ అంజాద్, అప్పసముద్రం ఏఎన్‌ఎం పీ పద్మావతి, కృష్ణంపల్లి వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర, జీ చెరువుపల్లి వెటర్నరీ అసిస్టెంట్ సయ్యద్ సల్మాన్, నేలటూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.గోపికు నోటీసులు జారీచేశారు. మూడ్రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పద్మావతి

సీతారామపురం: మండలంలోని సిద్దేశ్వరంలో ఎంపీపీ నిధులు రూ.4 లక్షలతో చేపడుతున్న సిమెంట్‌రోడ్డు పనులకు ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతితో కలిసి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమినాడు శైవక్షేత్రంలో సిమెంటురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎంపీపీ తెలిపారు. అనంతరం సిద్దేశ్వరాస్వామి, ఇష్టకామేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, దేవమ్మచెరువు ఉపసర్పంచ్ బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, బాలినేని మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



కావలి: పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏపీపీ మృదుల

కావలి పుస్తక పఠనాన్ని ప్రతిఒక్కరూ దినచర్యగా అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని కావలి ఏపీపీ ఎం మృదుల పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వెంగళరావునగర్‌లోని గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఏపీపీ ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాధికారిణి సునీత, లోక్‌అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని గ్రంథాలయంలో రెండోరోజు విద్యార్థులకు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య వివరించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రంథాలయంలో రెండోరోజు పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. గ్రంథాలయాధికారి ఓంకారం శ్రీనివాసరాజు, వెస్ట్ పాఠశాల హెచ్‌ఎం వై సీతాదేవి, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఎల్ తనూజ, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను లైబ్రేరియన్ శ్రీనివాసరాజు స్థానిక నాయకుడు జిలానీబాషాతో కలిసి ఆవిష్కరించారు.

దేవాలయాల ఆస్తులను కాపాడాలి

ఉదయగిరి: హిందూ దేవాలయాలకు సంబంధించిన అన్యాక్రాంతమైన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కాపాడాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో సంఘ పరివాహక సంస్థల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ఆలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. హిందువులను ఐక్యంచేసే ఉద్దేశంతో వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు లక్షలాది మంది హిందువులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ కావలి జిల్లా అధ్యక్షుడు కొండపనాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు శ్రీనివాసులు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డు నిర్మాణానికి నోచుకునేనా?

- కావలి మీదుగా వెళ్తున్న రెండు జాతీయ రహదారులు
- పట్టణంలో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- రింగ్ రోడ్డుతో సమస్యకు పరిష్కారం

కావలి: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. కావలి మీదుగా వెళ్తున్న రెండు జాతీయ రహదారుల కారణంగా పట్టణంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువవుతున్నాయి. వాటి కట్టడికి రెండు జాతీయ రహదారులను కలుపుతూ పట్టణ శివార్లలో రింగ్ రోడ్డును నిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది. చెన్నై–కోల్‌కత్తాలను కలిపే జాతీయరహదారి కావలి పట్టణం మీదుగా వెళ్తోంది. అలాగే కావలి–సీతారామపురాన్ని కలుపుతూ మరో జాతీయ రహదారి–167 బీజీని రూ.450 కోట్లతో చేపడుతున్నారు. వైఎస్సార్, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలను కోస్తా జిల్లాలతో కలిపే ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ రద్దీగా మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ జాతీయ రహదారి మీదుగా కావలికి చేరుకునే వాహనాలు పట్టణంలో గుండా చెన్నై–కోల్‌కత్తా రహదారిపైకి చేరుకుని చెన్నై, విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా జాతీయ రహదారి–565 తెలంగాణలోని నల్గొండ జిల్లా నకిరేకల్ నుంచి చిత్తూరు జిల్లా ఏర్పేడు వరకు వెళ్తుంది. దీంతో తెలంగాణ నుంచి నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రాకపోకలు సాగించే వారు కావలి–సీతారామపురం జాతీయ రహదారిని సద్వినియోగం చేసుకుంటున్నారు. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంతో పాటు ఇతర పట్టణాల నుంచి రాయలసీమకు రాకపోకలు సాగించే వారు కావలి పట్టణం మీదుగా వెళ్తుంటారు, జాతీయ రహదారి–16 నుంచి పట్టణంలోకి ప్రవేశించి కావలి–సీతారామపురం 167 బీజీ జాతీయ రహదారి పైకి చేరుకుంటారు. దంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. అందువల్ల కావలి ఉత్తర శివార్లలోని మద్దురుపాడు వద్ద జాతీయ రహదారి–16 నుంచి పట్టణ శివార్లలో రోడ్డు నిర్మించి కావలి–సీతారామపురం 167 బీజీ జాతీయ రహదారికి కలిపితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. అలాగే కావలి–సీతారామపురం 167 బీజీ రహదారి నుంచి కావలి పట్టణం మీదగా నెల్లూరు, గూడూరు,తిరుపతి, చెన్నైలకు రాకపోకలు సాగించే వాహనాల వల్ల కూడా ఇదే సమస్య ఉత్పన్నమవుతోంది. దీనికి పరిష్కారంగా కావలి దక్షిణ శివార్లలోని ముసునూరు వద్ద జాతీయ రహదారి 16 నుంచి కావలి–సీతారామపురం 167 బీజీ జాతీయ రహదారిని కలుపుతూ రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. దీంతో పట్టణ ప్రజలకు సౌలభ్యంతో పాటు, జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ట్రాఫిక్ జామ్ సమస్య ఉండదు.